క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మొగిలివలస ఆలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పాల్గొనడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీటీసీ బౌరోతు కాంతారావు, డాక్టర్ నరేంద్ర, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు తవ్వుకోవాలి



బొద్దాంలో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, ఫిట్ కంపోస్టులు ఏర్పాటుచేసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సాయిరాం ప్రజలకు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన బొద్దాం గ్రామంలో జాబ్‌కార్డులు ఉన్న లబ్ధిదారులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఇంకుడుగుంతలు, ఫిట్ కంపోస్టులకు ఇస్తున్న రాయితీ వేతనాల వివరాలు వెల్లడించారు. వాటివల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. అనంతరం పలువురి ఇళ్ల వద్ద ఏర్పాటుచేసిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

వంగర: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలోఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషిచేద్దామని తహసీల్దార్ ఈ సందర్భంగి సిబ్బందికి పిలుపునిచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఏపీసీ రామారావు

వంగర: పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వంగర కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు బోధించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో బి.రోహిణి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



సంగాం జాతర వద్ద అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

వంగర: అన్నదానం మహాదానం అని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిధి సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం మండలం నీలానగరం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత వావిలపల్లి బాబూ పురుషోత్తం నాయుడు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో ఏడు రోజుల పాటు 30వేల మంది యాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేస్తుండడంతో ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు.



బొబ్బిలిరూరల్ : దేవుడు బొడ్డవలసలో పూజలు చేస్తున్న భక్తులు



వంగర: కొప్పరవలస సోమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి: బాడంగిలోని శివాలయం వద్ద భక్తుల రద్దీ



తెర్లాం కొరటాంలో శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు

సర్వం శివమయం

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయా లకు చేరుకుని మహాశివుడికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే సాయంత్రం కూడా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో దీపారాధన చేశారు. వంగర మండలం సంగాం గ్రామానికి ఉత్తరాం ధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంత రం సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాజాం పట్టణంలోని కల్యాణ గౌరీ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద 1008 రుద్రాక్షలతో శివలింగం ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: బొబ్బిలిలోని చిట్టివీధి శివాలయంలో వేకువ జామున పూజలు చేస్తున్న మహిళలు



రేగిడి: సంకిలి శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



బాడంగి: పాల్తేరులో శివపార్వతుల కల్యాణం



రేగిడి: వన్నలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: మొగిలివలస విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ తదితరులు.



మెంటాడ: జయతిలో పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి



మెంటాడ: జయతిలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్



రాజాం: కల్యాణ గౌరి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద రుద్రాక్ష శివలింగానికి పూజలు



రాజాం: మందరాడ ముఖలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వంగర: సంగాంలో సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రామభద్రపురం: రామభద్రపురం శివాలయంలో క్యూలో ఉన్న భక్తులు



సంతకవిటి: వాల్తేరు గ్రామంలో మార్కండేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



వంగర: సంగాం సంగమేశ్వరస్వామి సన్నిధిలో అభిషేకాలు

విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలి



గురవాం కేజీబీవీలో విద్యార్థినులకు సూచనలిస్తున్న ఏపీసీ రామారావు

రాజాం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న పది, ఇంటర్‌మీడియట్ విద్యార్థినులు మంచి మార్కులు తెచ్చుకోవాలని ఎస్ఎస్ఏ ఏపీసీ ఎ.రామారావు సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గురవాం ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వసతితో పాటు మెనూపై ఆరాతీశారు. విద్యార్థినుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిని పది, ఇంటర్‌మీడియట్‌లో మంచి మార్కులు తెచ్చుకోవడంతో పాటు ఉన్నత చదువులు చదవాలని, మంచి ఉద్యోగాలు చేయాలని సూచించారు. గురవాం కేజీబీవీ పరిశుభ్రతతో ఉందని, మంచి బోధన జరుగుతోందంటూ ప్రిన్సిపాల్ సావిత్రిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: అసంఘటిత రంగ కార్మికులకు రాష్ట ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్ పార్కులో నిర్వహించిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై పది మాసాలు కావస్తున్నా ఇంతవరకు కార్మికుల కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కలాసీ, ఆటో రిక్షా, తోపుడుబళ్ల కార్మికులు ఎటువంటి భద్రతలేకుండా పనిచేస్తున్నారని, వారందరికీ సమగ్రచట్టం చేసి ఆదుకోవాలని కోరారు. పని ప్రదేశంలో తనిఖీలు లేకుండా నిషేధిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం జీవో 40ను తీసుకువచ్చి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అసంఘటిత రంగ కార్మికులందరికీ ప్రభుత్వ భాగస్వామ్యంతో పీఎఫ్ కల్పించాలని, బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పోలినాయుడు, రమణ, శ్రీను, రాంబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి



గెడ్డవలసలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: ప్రజలు శాంతియుతంగా మెలగాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధి గెడ్డవలస, ఎంజేవలస గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశమై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. చిన్నచిన్న విషయాలకే గొడవలు పడకుండా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షలు కార్పణ్యాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు.

ఇష్టంతో చదవండి

- గురుకులాల జిల్లా సమన్వయ అధికారి రూపవతి

రేగిడి: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని ఉమ్మడి విజయనగరం జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి విద్యార్థులకు ఉద్బోధించారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ముచ్చటించారు. మార్చి నెలలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సమయం వృథా చేయకుండా సిద్ధం కావాలన్నారు. అనంతరం గురుకులంలో వసతిగృహం, గ్రంథాలయాన్ని పరిశీలించారు. మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రేగిడి:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ చిన్నారావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇంజినీరింగ్ కార్యాలయంలో ఎన్నికల పోలింగ్‌కేంద్రం ఏర్పాటుచేశామని వెల్లడించారు. 70 మంది ఉపాధ్యాయులు ఇక్కడ ఓటు వేయనున్నారని పేర్కొన్నారు. అంతకుముందు ఎన్నికల సిబ్బందితో సమీక్షించి వివరాలు సేకరించారు.

శివతత్వంతోనే లోకరక్షణ



శివజయంతి మహోత్సవంలో బ్రహ్మకుమారీలు, భక్తులు

బొబ్బిలి:

శివతత్వంతోనే లోక రక్షణ, లోక కల్యాణం సాధ్యమని బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి అన్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో 89వ త్రిమూర్తి శివజయంతి మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపతాకాన్ని ఆవిష్క రించి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మావతి, ఎంపీటీసీ తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, బ్రహ్మకుమారీలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనలో అలసత్వం వద్దు



టీఏలతో సమీక్షిస్తున్న ఏపీడీ ఎం.శ్రీనివాసరావు

రాజాం సిటీ:

గ్రామాల్లోని వేతనదారులకు ఉపాధి పనుల కల్పనలో అలసత్వం వహించదద్దని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి నెలాఖరుకు లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. 100 రోజుల పనిదినాల కల్పనతో పాటు ఫారంపాండ్స్, సోక్‌పిట్స్ తదితర వాటిపై ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం తదిరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది



పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బందితో తహసీల్దార్ ఎస్‌కే రాజు

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం జరగనున్న నేపథ్యంలో ఆయా కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బుధవారం చేరుకున్నారు. రాజాం కేంద్రానికి చేరిన సిబ్బందికి తహసీల్దార్ ఎస్‌కే రాజు పలు సూచనలు చేశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో పేరు సరిచూసుకుని ఓటు నమోదుచేయించాలని చెప్పారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఎవరైనా అవకతవకలకు పాల్పడితే అటువంటి వారి వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈడీటీ ప్రకాశ్, వీఆర్వో అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



రేగిడి : దత్తపీఠంలో భక్తులతో మాట్లాడుతున్న ఎస్‌వీ రమణ

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుంటే మంచి భవిష్యత్తుతో పాటు మంచి సమాజాన్ని నిర్మించుకునే అవకాశం ఉందని పాలకొండకు చెందిన సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం రేగిడి గ్రామంలో వెలసిన దత్తపీఠంలో శివరాత్రి సందర్భంగా సత్సంగసమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మానవుడు ఆరు సద్గుణాలు కలిగి ఉంటాడో వారిలో భగవంతుడు ఉంటాడన్నారు. మానవుడు దేవుడిగా మారాలంటే వారిలో సహనం, పట్టుదం, పవిత్రత ఉండాలని వెల్లడించారు. కార్యక్రమంలో సామంతుల దామోదరరావు, కిమిడి సూరపునాయుడు, కిమిడి వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



రామభద్రపురం: పోలింగ్ కేంద్రం సిబ్బందికి సూచనలు చేస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి మధుసూధన్



బొబ్బిలి: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఆర్డీఓ రామమోహనరావు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ జె.వి. వి.ఎస్.రామమోహనరావు బుధవారం రాత్రి పరిశీలించారు. ఓటర్లకు సౌకర్యాలు,ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం శ్రీను, సీఐ కె.సతీష్ కుమార్, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురంలో...

రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేక అధికారి మధు సూధన్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. బయట వ్యక్తులు ఎవరైనా పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో ఉండాల్సిందేనన్నారు. ఓటు వినియోగించుకునే వారు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సులోచనరాణి ,ఎస్ఐ వి.ప్రసాదరావు, వీఆర్‌ఓ మహేష్ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రాజాం-రామభద్రపురం రోడ్డులో పెరుమాళి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు

తెర్లాం: నిత్యం ప్రయాణికులు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రాజాం-రామభద్రపురం ఆర్అండ్‌బీ రోడ్డులో పెరుమాళి వద్ద మోడుబారిన ఓ నిద్రగన్నేరు చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఈ చెట్టుతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం దోనని వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఈ చెట్టు కొమ్మలు గతంలో ఎన్నోసార్లు విరిగిపోయి రోడ్డుపై పడ్డాయి. ప్రస్తుతం చెట్టు చాలావరకు ఎండిపోయింది. కొమ్మలు విరిగి వాహనాలపై పడితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాహన చోదకులు అంటున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ఎండిన కొమ్మలను తొలగించాలని ఆ మార్గంలో ప్రయాణించే వారు కోరుతున్నారు.